# మండుటెడారిలో

## శ్రీ వఝ్ఝల రామనరసింహం

> దిక్కులేని అభాగ్యుని బంధుకోటిలో ఆదరించేవారే ఉండరు. ఎడారివంటి సమాజంలో తళుక్కున మెరిసే స్వప్నాలకే తృప్తిపడ్డం మానవస్వభావం. ఆ క్లుప్త స్వప్నానుభవాన్ని కాపాడుకోడమే జీవితంలో మిగిలే ఆనందమౌతుంది.

"ఏం, మామయ్యా! కులాసాగా వున్నావా?"

పడకకుర్చీలో మేనువాల్చి, వార్తాపత్రిక చదువుకుంటూవున్న, శేషగిరి ఈ పలకరింపు విని, కళ్లద్దాల్లోంచి పక్కకి చూశాడు. ఎదురుగా జోగయ్య, చింపిరి గుడ్డలతో, చేతిలో ఓసంచీ పట్టుకుని, వికిలినవ్వు నవ్వుతూ, నించున్నాడు. శేషగిరి ముఖంలో ఓనిముషంపాటు ఆశ్చర్యం, తరువాత చిన్న చిరాకు, కనిపించి మాయమైనాయి. మళ్లా న్యూసుపేపరులో నిమగ్నుడయ్యే, అన్నాడు శేషగిరి:

"ఏంరా; జోగీ! ఏ బండిలో వస్తున్నావు? లోపలికి వెళ్ళి, అత్తయ్యతో చెప్పు."

జోగయ్య లోనికి వెళ్లేడు. మధ్యగదిలో శేషగిరి పెద్దకూతురు అనూరాధ కన్పించింది. ఆమె జోగయ్యవేపు ఓ నిముషం వింతగా చూసి, "ఏం జోగయ్యా! ఎప్పుడు రావటం" అంది. ఆ తర్వాత, ఆమె, "అమ్మా! జోగయ్యవచ్చాడే!" అని కేకవేస్తూ వంటింటివేపు వెళ్లింది.

జోగయ్య తన సంచిని ఓమూల పెట్టి, అట్లానే నించుండిపోయాడు, ఏమి చేయడానికీ తోచనివాడిలా. వంటింట్లోంచి, "ఆ, వచ్చేడూ? ఔను మరి! మన యిల్లొక్కటే మిగిలిపోయింది కదూ, మీదపడి తిండానికి!" అనే తన అత్తయ్య మాటలు జోగయ్యకి స్పష్టంగా వినబడ్డవి.

జోగయ్య కేమీ ఆశ్చర్యం కలగలేదు. ఎందుకంటే, ఇటువంటి "స్వాగతా"నికి సిద్ధపడే తనిక్కడికి వచ్చాడు! తలిదండ్రులు ఏనాడో పోయిన తను, కేవలం బంధువుల యిళ్ళలో తిని బతకడమే జీవనోపాధిగా పెట్టుకున్నప్పుడు, ఇంతకంటె ఎక్కువ మర్యాద నాశించడం వుత్తి తెలివితక్కువ! తన తలిదండ్రులు పోతూపోతూ, తనకి ఆస్తికంటె అప్పులే ఎక్కువ వదిలిపోయారు. తను 4 వ ఫారం 4 ఏళ్లు ఫెయిలయి చదువు మానుకోవడంచాత, తనకి వుద్యోగం దొరకడం వుత్తి అపోహ! అటువంటప్పుడు, తనకి బంధువుల పంచను చేరడంతప్ప మరొక గత్యంతరం లేకపోయింది ఈ పరిస్థితులలో తను మర్యాదను ఏ ముఖంతో ఆశిస్తాడు! తన పొట్టగడవడంకంటే ఏ మర్యాదలు ముఖ్యం కావని తను తెలుసుకొన్నాడు. "కడుపు టంచులదాటి దహించు" క్షుద్బాధముందు ఈలాటి గౌరవాలు, మర్యాదలు ఏపాటివి? ఈరకం వేదాంతంతోనే తను యిన్నాళ్ళూ జీవితాన్ని గడుపుతూవచ్చాడు. తన అత్తయ్య ఇప్పుడు అన్నమాటలకంటె ఎక్కువ కఠినమైన పలుకులు తను ఇతర బంధువుల ఇళ్ళలో విన్నాడు... ఇలాటివి తనకొక వింతకాదు...

ఇటువంటి ఆలోచనలతో జోగయ్య ఆ గదిలో ఒక్కడూ అట్లానే నించుని వున్నాడు. ఇంతలో తన అత్తయ్య గది ద్వారం వద్దకి వచ్చి పల్కరించింది.

"ఏం జోగయ్యా! కులాసాగా వున్నావా?"

"ఊఁ!" అన్నాడు జోగయ్య.

"కోచిలోనా వచ్చావు?"

"ఊఁ! చిన్నాన్నగారి వూరినించి"

"చిన్నాన్నగారింటినించి ఎందుకు వచ్చేశావూ?"

జోగయ్య సందిగ్ధావస్థలో పడ్డాడు. ఈ ప్రశ్నకి జవాబు ఆమెకి తెలిసి కూడా అడుగుతున్నది!... చిన్నాన్నగారింట్లో వారు వుండనిచ్చినంత కాలం తను వున్నాడు. ఆ తర్వాత వారు పొమ్మంటే ఈ పంచను చేరేడు. ఏ బంధువింట్లోనైనా తను యింతే. వారు గెంటివేసేవరకూ తను వుంటాడు. తనకి మరో జీవనోపాధి లేనప్పుడు ఏం చేయడం... ఇక్కడైనా అంతే.

"సరే! మడికట్టుకుని నువ్వూ మామయ్యా భోజనానికి రండి!" అని ఆమె వెళ్ళిపోయింది.

శేషగిరి యింటికి జోగయ్య వచ్చిన రెండు, మూడు రోజులవరకూ, అంతా సవ్యంగానే కన్పించింది.. కాని, ఆ తర్వాత పరిస్థితులు తారుమారవసాగినై. శేషగిరి చీటికీ మాటికీ, కోపంగా ఎగిరిపడుతున్నాడు. ఇంట్లో ఎవరూ కూడా జోగయ్యతో సరిగ్గా మాట్లాడడం మానేశారు. ఒకవేళ ఏదో మాట్లాడినా, ముభావంగా, అయిష్టంగా, నీచంగా మాటాడేవారు. పిల్లిమీద ఎుక్కమీద పెట్టి జోగయ్యను నిందించేవారు. "ఇంట్లో శని తిని వేస్తున్నది" అని అనడం ప్రారంభించేరు..

—జోగయ్య చెక్కు చెదరలేదు! కనీసం మనసులోనైనా బాధపడలేదు. ఆకలి నిస్సహాయత అనేవి మానవుడిని ఎటువంటి నీచానికైనా పాల్పడ చేస్తాయనే వేదాంతాన్ని అతడేనాడో నేర్చుకున్నాడు అదీకాక, "మనస్సు" అనేదానిలో జోగయ్యకు నమ్మకం లేదు. మానవులందరికీ కేవలం ఒక పొట్ట ఆకలి మాత్రమే దేవుడిచ్చాడని అతని కొక నమ్మకం ఏర్పడింది.

రోజులు గిరగిరా దొర్లిపోతున్నవి... ఓనాడు సాయంత్రం జోగయ్య వీధివరండాలో కూచుని కాగితం మీద పెన్సిలుతో ఏదో గొలుకుతూవుండగా శేషగిరి ఆఫీసునుంచి వచ్చాడు.

"ఇవాళ రేషన్లు తెచ్చావురా జోగీ?"

"తెచ్చాను మామయ్యా"

"ఆ రాస్తున్నది ఏమిటి?"

"అబ్బే... ఏమీ లేదు... మామయ్యా..."

"ఏమీ లేకపోవడమేమిట్రా? వుత్తరమా?


## నారసింహ లేహ్యము



బంగారు చేర్చబడినది. మేహము, నిర్శక్తక, నిస్సత్తువ శుక్లనష్టమును హరించి బలమును, కాంతిని, వీర్యవృద్ధిని కలిగించు వరప్రసాదము—

20 రోII డబ్బి రు. 3-4-0 పోస్టేజి 12 అ.

సి. ఏ. & కంపెని. "ఆయుర్వేదసమాజం" పెరిదేపి- నెల్లూరు జిల్లా.

# మధురస్వప్నం

"కాదు.. కథ రాస్తు...న్నా...ను.."

"కథా! ఓ! అదొక్కటే తక్కువైందికేం" అంటూ, శేషగిరి ఇంట్లోకి నడచాడు.

మూడురోజుల తర్వాత, జోగయ్య తన కథ పూర్తిచేసి ఓ పత్రికకి పంపించాడు. మర్నాటినుంచీ, పోస్టుమేనుకోసం ఎదురు చూడ నారంభించాడు!

నెల్లాళ్ళు గడిచాక, ఓ తెలుగుపత్రిక జోగయ్య పేరున వచ్చి పడింది...అందులో జోగయ్యకథ ప్రకటింపబడ్డది...ఒక్క నిముషంపాటు జోగయ్య మూర్ఛపోదామనుకున్నాడు! కాని, అతనికి మూర్ఛ రాలేదు—ఆనందంతో వుక్కిరి బిక్కిరి అయిపోయాడు.

ఆనాడు రాత్రి జోగయ్యకు నిద్రపట్ట లేదు. తన కథ గురించి ఏమేమో ఆలోచించుకుంటున్నాడు...ఈ పత్రికలు, కథకులు, కవులు, సంపాదకులు, ముద్రణాలయాలు, అన్నీ, అతని కళ్ళఎదుట కన్పిస్తున్నవి...ప్రఖ్యాతాంధ్రకవులు అతని వూహానేత్రం ఎదుట గోచరిస్తున్నట్లయింది...కవిసామ్రాట్టు విశ్వనాథవారి రచనలు, అడవిబాపిరాజుగారి కళానైపుణి, ఓమారు స్మరించుకున్నాడు...ఈ తన ఒక్క కథతో తనకి ఆంధ్ర కవితాలోకంతో ఎడతెగని పరిచయం ఏర్పడిపోయినట్లు భావించుకున్నాడు!

తన కథ ప్రకటింపబడ్డది! ఆ కథ ఎలా వున్నదో తనకు సరిగ్గా తెలియదు. అదీ కాక, ఈనాడు చాలా తెలుగుపత్రికలలో కథలు ప్రకటింపబడాలంటే, అవి బాగా వుండవలసిన అవసరంలేదని తనకు తెలుసు! కొద్ది పెద్దతరగతిపత్రికలు తప్ప మిగతా వాటిలోని కథలను తను అభినందించలేక పోతున్నాడు. కాని, అటువంటివాటికీ నేడు ఎక్కువ ప్రచారం వుంది! దానికి కారణం, బహుశః, పాఠకులలో సరియైన సారస్వతాభిరుచి లేక పోవడమేమో! కొందరు చదువుకున్నవారు, పెద్ద గ్రంధాలను పత్రికలను చదువుతామనేవారు సహితం, ఈ తుక్కు సారస్వతాన్ని కొని, చదివి, అభినందించడం, తనకు తెలుసు... ఇంతకీ, తన కథ కూడా, చెత్తకథలలో చేరుతుందో, లేదో, తనకి తెలియదు... ఏమైనా, తన మనస్సులో బ్రహ్మాండమైన, విచిత్రమైన భావాలు చెలరేగుతున్నవి. ఆ భావాలన్నిటినీ తను కాగితంమీద పెట్టడం నేర్చుకోవాలి...ఇకమీదట తను కథారచనలో విపరీతమైన కృషిచేయాలి... తను ప్రపంచంలో ఎందుకూ పనికిరాని వాడనిపించుకోకూడదు. తనకి మరి ఏ వుద్యోగమూ అవదని తెలుసు......ఇటువంటి ఆలోచనలతో, జోగయ్యకి తెల్లవారుతూ వుండగా, నిద్ర వచ్చింది.

...జోగయ్య యిప్పుడు పట్టుపట్టి కథారచన సాగిస్తున్నాడు. నెల్లాళ్ళు కష్టపడి రాసి, ఓ అరడజను కథలు వివిధమైన పత్రికలకి పంపించాడు......

ఇప్పుడు జోగయ్య కథకుడైనాడు. అతని రచనలు రమారమి ప్రతి పత్రికలోను కన్పిస్తున్నవి. అతని కథా రచనలో ఇప్పుడు అతనికి దృఢ నమ్మకం కుదిరింది. ప్రతి నెలా చాలా పత్రికలు—కాంప్లిమెంటరీ కాపీలు—అతనికి వస్తున్నవి. కొన్ని పత్రికలు, తన కథ ప్రచురించినప్పటికీ, తనకి వుచిత కాపీలను పంపకపోవడం అరుదుకాదు! ఇంట్లోనివారందరూ, తీరుబడి సమయాల్లో పత్రికలని చదువుతూ కాలం గడపడం నేర్చుకున్నారు.

ఓనాడు జోగయ్య రాసుకుంటూ ఉండగా, అనూరాధ అతనివద్దకు వచ్చింది.

అనూరాధ 15 ఏళ్ళ పిల్ల. చామనచాయగా, కోలటి ముఖంతో, పొడుగ్గా ఉంటుంది. జోగయ్యకి పత్రిక ఏదైనా వచ్చిన వెంటనే ప్రప్రథమంగా చదివే వ్యక్తి అనూరాధ. ఆమెతర్వాత శేషగిరి చదువుతాడు. ఆఖరున, పత్రిక యింకా

నిద్రపోతున్న అనూరాధని కిటికీలోనుంచే చూసి సెలవుతీసుకున్నాడు జోగయ్య.



ముక్క ముక్కలవకుండా వుంటే, జోగయ్య చదువుతాడు...

అనూరాధ జడకి రిబ్బను చుట్టుకుంటూ అంది. "జోగులూ! కథలు రాయటం ఎప్పటినుంచి మొదలుపెట్టేవు నువ్వు?"

ఇంతవరకూ తనతో ఎప్పుడూ కూడా చనువుగా మాట్లాడని అనూరాధ, ఈనాడు తనతో, నవ్వుతూ, మాట్లాడ్డం జోగయ్యకు ఆశ్చర్యం కలిగించింది. ఇంతవరకూ తనని ఎవడో పైవాడిలా, బంట్రోతులా, ఆమె చూస్తున్నది.

"అబ్బే! ఏదో రాస్తున్నానులే...... యింతకీ నా కథ లెట్లావున్నాయి? బావున్నాయా?"

అనూరాధ పకపక్కన నవ్వి అంది.

"మా బాగా అడిగావులే! నువ్వు రాసిన కథలు ఎట్లా వున్నవో నీకే తెలియదా!"

ఎవరు రాసిన కథలయొక్క బాగోగులు వారికి తెలియడం కష్టమనీ, యితరులు చెప్పవలెననీ జోగయ్య ఆమెకి బోధించ ప్రయత్నించాడు; కాని, అనూరాధ మాత్రం అతని మాటలు నమ్మలేదు. ఏమైనా, పత్రికాపఠన అంటే ఆమెకి చాలా ప్రీతి. ఈ విషయంలో ఆమెది జోగయ్యకంటె పై చేయి అనిపించుకుంది.

జోగయ్య కథారచనని వదిలిపెట్టలేదు. అతనికి మరోక పనిలేదుకూడాను. కాని ఈ సందర్భంలో జోగయ్యకి ఒక గొప్ప సత్యం గోచరించింది. ఏమిటంటే-నిజంగా మరోక వుద్యోగం చేస్తూ, కథారచన పట్టున సాగించడం అసాధ్యమని! అయితే-కేవలం కథారచనమీదే "బ్రతుకు"తూ వున్న ఆంధ్రుడెవడైనా వున్నాడో లేదో అతనికి తెలియదు. కవిత్వం కేవలం, ఓ పక్క వుద్యోగం చేసుకుంటూ మరో పక్క ఖుషీకి చేసేపనేమో? మస్తుగా డబ్బువుండి కాలుమీద కాలు వేసుకొని బ్రతకగల అదృష్టంవుంటె కవిత్వానికి ఎంత అవకాశం! కాని, డబ్బున్నంతమాత్రాన కవిత్వం వుద్భవించదన్నమాట నిజమే కాని కవిత్వం చేయాలంటే డబ్బుంటేనే గాని పని జరగదని తను గ్రహించాడు.

ప్రతీరోజూ అనూరాధ జోగయ్యతో పత్రికల గురించి కథల గురించి ఏదేదో మాట్లాడుతుంది. ఒకొక్కమారు ఆమె అతనితో వాదిస్తుంది. ఒకొక్కమారు అతన్ని పొగుడుతుంది. ఆ యింట్లో అతనితో ఇప్పుడు చనువుగా మాట్లాడే స్నేహితురాలు ఆమె ఒక్కర్తె అనుకున్నాడు జోగయ్య.

ఓనాడు అనూరాధ అంది.

"జోగాయ్! ఈ నెల ప్రత్యేక సంచిక లేవో పెద్దవి వస్తాయన్నావు- ఇంకా రాలేదూ?"

ఏదో రాసుకుంటూవున్న జోగయ్య తృళ్ళిపడి అన్నాడు: అన్నట్లు మూడు పత్రికలేవో నిన్న వచ్చాయి. నా పంచిలో దాచేను. నీతో చెప్పడమే మరచాను సుమా!"

"నాతో చెప్పకుండా, పత్రికలు దాచుకుంటున్నావుకదూ?" అంది అనూరాధ 'వుండు, నీ పని చెప్తాను' అన్నట్లు చూస్తూ.

ఆమె గబగబా వెళ్ళి జోగయ్య పంచిలోని బట్టలన్నీ పైని పారవేసి పత్రికలను తీసి మంచంమీద కూలబడి చదువ ప్రారంభించింది.

ఆనాడు సాయంత్రం చీకటి పడుతూ వుండగా జోగయ్య వాకిట్లో కూచుని ఏదో పద్యం చదువుతున్నాడు.

"...సంస్కృతంబుపచరించిన
పట్టున భారతీ వధూ
టీ తపనీయ గర్భనికటీ భవ
దానన పర్వసాహితీ
ధాటిక నాటక ప్రకర భారత
భారతి సమ్మత ప్రభా
పాత సుధా ప్రపూర బహుభంగ
ఘుమంఘుమ ఘుంఘుమార్భటీ
జాతక తాళ యుగ్మలయసంగతి
చుంచువిపంచికామృదం
గాతత తేహితత్తహితహోధిత
దంధణిధాణు దింధిమి..."

ఇంతలో అనూరాధ వచ్చి "ఏమిటి జోగయ్యా! అట్లా చదువుతున్నావు?" అంది.

"అల్లసాని పెద్దన అనే ఒక గొప్ప కవి రాసిన పద్యం అది. కృష్ణదేవరాయల ఆస్థానంలో ఆ మహాకవి 30 పంక్తుల పద్యాన్ని ఆశువుగా చదివాడట. అప్పుడు కృష్ణదేవరాయలు ఆ కవిపాదానికి గండపెండేరము తొడిగి గౌరవించాడట" అని జోగయ్య ఆ వృత్తాంతం ఆమెకి బోధించాడు.

"అబ్బ! అంత గొప్పకవా?" అంది అనూరాధ, ఆశ్చర్యంతో పెదిమెలు బిగించి. ఆ తర్వాత, ఏదో జ్ఞాపకం వచ్చినదానిలా అంది: "జోగాయ్! పద్యాలు రాయడం సులభమా, కథలు రాయడం సులభమా?"

"కవిత్వమన్నది ఏదీ కూడా సులభంగానూ, చవకగానూ తయారయే వస్తువ కాదు. రెండూ కష్టమే. కొన్ని విషయాలలో, పద్యరచనకంటె, కథారచనే ఎక్కువ కష్టమని నా వుద్దేశం. అలా అని పద్యరచన సులభమని కాదు."

అరచేతుల్లో చెక్కిళ్లు వుంచుకుని, కొంచంసేపు ఆలోచించి అనూరాధ అంది:

"మా పిన్నికూతురుకి పద్యాలురాయడం వచ్చునని వూరంత గర్వం!—జోగులూ, నాకు కూడా పద్యాలు రాయడం నేర్చుకోవా లనుంది. నేర్పవూ?"

"సరేలే"

మర్నాడు వుదయం జోగయ్యవద్దకి





# కుష్ఠు ★ బొల్లి

వగైరా మేహమచ్చలు, సెగ, సవాయి వ్యాధులకు, గ్యారంటి చికిత్స, క్యాటలాగు ఉచితం. జి. వి. రెడ్డి అండ్ కో., (రిజిష్టర్డు) "భాస్కరాశ్రమము" గోపాలపురం, తూ. గోదావరి.

వచ్చి కూచుంది అనూరాధ. అతడామెకు "గురువు"లు "లఘువు"లు, "గణములు" మొదలైనవన్నీ చెప్పేడు. వివిధగణాలని సులభంగా తెలుసుకోనేటందుకు "యమాతారాజభానస" అనే సూత్రాన్ని జ్ఞాపకం వుంచుకోమన్నాడు. "అంటే అర్థం ఏమిటి?" అంది అనూరాధ. "దాని కర్థం లేద"న్నాడు జోగయ్య.

నాలుగురోజు లయాక అనూరాధ ఓ నాడు జోగయ్యతో అంది: "జోగులూ! పుత్పల మాల రెండుపంక్తులు రాశాను. ఎలావుందో చూస్తావూ?"

"చంపేవు! నిన్న ఛందస్సు నేర్చుకోవడం, ఇవాళ పద్యాలు రాయడమూనా" అన్నాడు జోగయ్య నవ్వుతూ—

"అబ్బ! మొదట చూసి మాట్లాడు"

"వూం! చదువయితే!"

"జాగ్రత్తగా విను"

ఉ॥ రాజునుబోలు నీముఖము
రంజిలచేయును నామనోహరీ!
పూజలుచేతు నెల్లపుడు
నాదగుమాటను సుంత విందువే!."

"నువ్వింత వేగిరం పద్యాలు రాయడం ప్రారంభించకూడదు. ఇంకా చాలా గ్రంథాలు చదవాలి మొదట."

"నువ్వేమిటి చదివేవు."

"మనుచరిత్ర, వసుచరిత్ర, ఉత్తర హరివంశం, వగైరా"

"ఇంతకీ, నా పద్యం రైటా తప్పా? చెప్పవేం?"

"ఛంధస్సుకి కట్టుబడి వున్నంతమాత్రాన పద్యం మనోరంజకంగా వుండదు. మంచి భాష వాడాలి అదీకాక, నీ రెండో పంక్తిలో, యతి వెయ్యడంలేదు"

"ఓస్! ఓ పంక్తిలో యతి వెయ్యకపోయినంతమాత్రాన కొంప మునుగుతుందా ఏమిటి?"

జోగయ్యకి నవ్వు వచ్చింది.

ఇంతలో "ఒసేవ్! అనూ! ఎక్కడకి పోయావే" అని కేక వినబడ్డది. "అమ్మ పిలుస్తున్నాది" అంటూ, అనూరాధ తుర్రున పరిగత్తి పారిపోయింది. ఆనాటి నుంచి అనూరాధ మరెప్పుడూ కవిత్వం నేర్చుకోలేదు.

రోజులు గడిచిపోతున్నవి.

ఓనాటి మధ్యాహ్నం, శేషగిరి, భార్యతో కలిసి ఎవరో బంధువులను చూడ్డానికి వెళ్ళేడు. జోగయ్య రేవను షాపుకి వెళ్లేడు. అనూరాధ వక్కత్తీ గదిలో పడుక్కుని పత్రిక చదువుతున్నాది

8-80 అవుతూండగా, భుజంమీదబియ్యం మూట, చేతుల్లో సంచులతో సామాను, మోసుకొని అలసిపోతూ జోగయ్య వచ్చాడు. సామానంతా కొట్లో సర్దివేసి, అనూరాధ వున్న గదిలోకి వచ్చి, చాప మీద కూలబడుతూ, "అనూరాధా! ఒక గ్లాసుడు మంచినీరు ఇద్దూ! గొంతుక ఎండిపోతున్నది" అన్నాడు జోగయ్య, నుదుటి చెమట తుడుచుకుంటూ....

జోగయ్య మంచినీరు తాగుతూవుండగా, అనూరాధ అతని మొహంవైపు పరిశీలనగా చూసింది. జోగయ్య ఎంత అలిసిపోయాడు! అతని ముఖంవైపు ఇంత పరిశీలనగా తనెప్పుడూ చూడలేదు. అతని బీదతనం, ఆకలి మంట, వేదన, అంతా, అతని ముఖంలో స్ఫుటంగా కనిపిస్తున్నవి. బండెడు సామాను మోసుకొని వచ్చాడు. ఎంత అలసిపోయాడో పాపం! అనూరాధలో ఇన్నాళ్ళయీ నిద్రపోతున్న జాలి, దయ, కరుణ అనే మానవస్వభావాలు ఒక్కమారు మేల్కొన్నవి.

"జోగయ్యా! ఎంతలా అలిసిపోయావ్!"

"వూ! రేవనుషాపు 8 మైళ్ళదూరం వుంది"

"జోగయ్యా! ఒక్క నిముషం అట్లానే కూచో. ఇప్పుడే వస్తాను" అని అనూరాధ వంటింటివేపు వెళ్ళింది.

"ఇస్" అని జోగయ్య నిట్టూర్పు విడిచాడు. అయిదు నిముషాల తర్వాత, గాజుప్లేటులో నాలుగు గులాబీ జాములు తెచ్చి జోగయ్య ముందు వుంచి, అనూరాధ అంది. "గులాబీ జాములు తిను. అమ్మ ఇవాళ తయారు చేసింది. మేమందరం తిన్నాము"

జోగయ్య ముఖంలో ఆనందరేఖ కన్పించింది. అనూరాధముఖంవైపు ఓమారు చూశాడు. ఆ తర్వాత—భగ్గున కడుపు మండిపోతూన్న అన్నార్తుడిలా—గులాబీ జాములను అమృతప్రాయంగా, గబగబా, ఒక్క తృటిలో తినివేశాడు. అటువంటివి తినడం తన జీవితంలో ఇదే మొదటి మారు. అనూరాధ కళ్ళలో గిర్రున నీళ్ళు తిరిగినవి. ఆమె గొంతు సవరించుకొని అంది:

"అమ్మ, నాన్న, బాబయ్యగారింటికి వెళ్ళేరు.—గులాబీజాములు నీకిచ్చానని ఎవరికీ చెప్పకేం?"

"అంత దొంగతనం ఎందుకు అనూరాధా? చెప్తేనేం?"

"అమ్మ కోపగించుకుంటుంది"

"అటువంటప్పుడు నాకెందుకిచ్చావు?"

"అబ్బ! ఎందుకోనకందుకు మళ్ళీ నువ్వు యిలాటి వస్తువులు ఎప్పుడు తినగలవు?"

జోగయ్య జవాబు చెప్పలేకపోయాడు; ఆమె ముఖంవైపు ఓనిముషంపాటు తీక్ష్ణంగా చూశాడు—ఆమె మోము అతి కోమలమైన పుష్పమువలె వుంది; ఆ నిము

(37-వ పేజీ చూడండి)

ఫోనిక్సు పంకాలు




A. C & D. C.

★

తమిళనాడు, కేరళ, మైసూరు, ఆంధ్ర దేశము (పశ్చిమ గోదావరి జిల్లా వరకు) నకు

సోల్ ఏజెంట్లు:

RM. S. & Co, Ltd, 16, Broadway, MADRAS

విశాఖపట్టణం అండ్ తూర్పుగోదావరి జిల్లాలకు ఏజెంట్లు:—

మెస్సర్సు మాక్‌డవల్ అండ్ కంపెనీ లిమిటెడ్.

విశాఖపట్టణం.

స్టాకిష్టులు కావలెను

# మండుటెడారిలో మధుర స్వప్నం

(11-వ పేజీ తరువాయి)

వంలో ఆమె కేవలం ఒక శాంత మూర్తి, దయామయి...

"అనూరాధా!...అనూ..."

అనూరాధ చిన్న చిరునవ్వు నవ్వి, వూరు కొంది......

రెండు రోజులు గడిచాక, ఓ నాటి సాయంత్రం జోగయ్య ఏదో వ్రాసుకుంటూ వుండగా అనూరాధ అతనివద్దకు వచ్చి ఆతృతగా అడిగింది.

"జోగయ్యా! నీ కథలలోని కథానాయికలను ఎప్పుడూ ఒకేలాగున వర్ణిస్తావేం?"

"స్త్రీ సౌందర్యాన్ని గురించి నా అభిప్రాయం ఎప్పుడూ ఒకేలాగున వుంది. కాబట్టి. అంతేకాదు, నావంటి అనాకారుడికి, బీదవాడికి స్త్రీ సౌందర్యం గురించి ఎక్కువ ఆలోచించడానికిగాని, పరిశీలించి అభినందించడానికి గాని అవకాశం వుండడం కష్టం"

"అంటే—ఆ వదులుగా వేసుకున్న పొడుగాటి జడ, ఆ చీరకట్టు, ఆ అలంకరణ—ఇవే అందం అంటావ్. అంతేనా?"

"నా వుద్దేశంలో అంతే"

అనూరాధ కొంచంసేపు ఏదో ఆలోచించి, "వుండు—ఇప్పుడే వస్తాను" అంది, పక్క గదిలోకి రివ్వున పరుగు తీస్తూ. జోగయ్య ఆశ్చర్యపోయి, ఆమె వెళ్ళిన దిక్కే చూస్తూ, అట్లానే వుండిపోయాడు.

అరగంట గడిచాక, అనూరాధ వచ్చింది. ఆమె బాగా అలంకరించుకొంది. వక్షం మీదికి జారవిడిచిన పొడుగాటి జడ, ఆకాశంరంగు చీర, సిల్కు బ్లౌజు, పౌడరద్దిన ముఖం—ఈ వేషంతో వున్న ఆమెని చూసి, జోగయ్య ఆశ్చర్యపోయాడు! అనూరాధ చిరునవ్వు నవ్వుతూ అంది "నే నిప్పుడు ఎట్లా వున్నాను?"

జోగయ్య మాట్లాడలేదు. నిశ్శబ్దంగా, ఆమె కళ్లల్లోకి దీర్ఘంగా చూస్తూ అట్లానే వుండిపోయాడు.

జోగయ్యలో ఇన్నాళ్లయీ మాటు మణిగి, త్రుప్పుపట్టి, నిద్రాణమైవున్న సౌందర్య పిపాస ఒక్కమారుగా మేల్కొనసాగింది. తన జీవితంలో ఇన్ని సంవత్సరాలుగా తనకి కేవలం ఆకలి, తిండి మాత్రమే ముఖ్య విషయాలుగా కనిపిస్తున్న జోగయ్యకు, తనలో సౌందర్యాన్ని అభినందించే శక్తికూడా వుందని, తెలుసుకోలేకపోయాడు. ప్రతీ జీవికి, తెలిసో తెలియకో, ఈ సౌందర్య పిపాస, ప్రాపంచిక సౌఖ్యాభిలాష, వ్యామోహం, కోరిక, అనేవి పుట్టుకతోనే దేముడిస్తాడని తను చాలాకాలం కిందట చదివిన సంగతి ఇప్పుడు జ్ఞాపకం వచ్చింది.

"మాట్లాడవేం జోగయ్యా?" అంది ఆమె మళ్లీ.

అనూరాధ జోగయ్యకళ్ళకి ఎంతో చక్కగా కనిపించింది.

"ఎంత చక్కగా వున్నావు నువ్వు!" అన్నాడు జోగయ్య.

"నిజం? నే నందంగా వున్నానంటావా?"

"నేను నిజం చెప్తున్నాను అనూరాధా! నువ్వు ఎంతో ముద్దొస్తున్నావు. అంతే కాదు. నా కథలలోని కథానాయికలందరికంటె, నీలోనే ఎక్కువ సౌందర్యం వుందని యిప్పుడు తెలుసుకున్నాను—నా కళ్ళకి కన్పించిన నిజం చెప్తున్నాను!"

"ఛీ! ఫో! ఏం వెంకిమాటలు బావా!" అని, చిన్న సిగ్గుతో, తల వంచుకుని, అనూరాధ రివ్వున పరిగెత్తి, చీర కుచ్చెళ్లను తన్నుకుంటూ పారిపోయింది.

ఆ ఆఖరుమాట విని జోగయ్య విస్తుపోయాడు! తన మామయ్య కూతురికి తను 'బావ' అవుతాడన్న సంగతి ఇప్పుడు తెలిసిందతనికి......

జోగయ్య జీవితంలో ఇప్పుడు సరికొత్త అధ్యాయం ఒకటి తెరువబడింది. మండుటెడారిలా వున్న తన జీవితంలో చల్లటి సంగీతాన్ని ఇప్పుడిప్పుడే, ఎవరో వినిపిస్తున్నట్లుగా వున్నది...... ప్రపంచంలో యింతవరకూ తను ఎరుగని ఒక విచిత్రమైన అనుభవాన్ని, ఆనందాన్ని, చవిచూస్తున్నాడు. 'నా' అన్నవారెవరూ లేరనుకున్న తనకు, రోజు రోజుకూ అనూరాధ ఆత్మీయురాలవుతున్నదని తెలుసుకున్నాడు ఈ లోకంలో తనను అభిమానంతోను, ప్రేమతోను చూస్తున్న వ్యక్తి బహుశః అనూరాధమాత్రమే... ఆమె మాత్రమే...

ఆనాటి రాత్రి జోగయ్యకి విచిత్రమైన కల వచ్చింది...... అటువంటి స్వప్నం తన కెప్పుడూ రాలేదు. కలలో, తనూ అనూరాధ కలిసి ఎక్కడికో తొందరగా నడిచి వెళ్లిపోతున్నారు. గాఢాంధకారమయమైన అరణ్యాలు, పుట్టలు, దాటుకొని వెళ్ళి, ఒక కొండ చివరకి ఎక్కేరు. చుట్టూ అంధకారం! ముందు తోవ కన్పించలేదు. ఒక్క అడుగు పక్కకివేస్తే ప్రాణాలు పోయేటంత చివరని నించున్నారు. అనూరాధ భయంతో వణికిపోతున్నది. తను ఆమెచుట్టూ చేయివేసి, ఆమె పడిపోకుండా చూస్తున్నాడు. ఇంతలో పెద్దపులి అరుపు ఒకటి భయంకరంగా దగ్గరలో వినిపించింది. అనూరాధ కెవ్వున కేకవేసి, పక్కకి పడిపోయి, ఒక్క వూపున దొర్లిపోయింది. తను 'అనూరాధా' అని గట్టిగా పిలుస్తూ ముందుకు అడుగువేయబోగా, కాలుజారి, ఆ బ్రహ్మాండమైన లోయలోకి—

—కల అంతమైంది. పెద్ద కేక వేసి జోగయ్య మేల్కొన్నాడు.

రోజులు త్వరగా దొర్లిపోతున్నవి. ఇప్పుడు జీవితంలో ఏదో కొత్తదనం కన్పిస్తున్నది జోగయ్యకు. ఈ రోడ్లు, ప్రజలు, వూరు, బజారులు, అన్నీ కొత్తగా కన్పిస్తున్నట్లున్నవి. "నా జీవితంలో కన్పిస్తున్న ఈ కొత్తదనం ఏమిటి? ఈ మార్పు ఏమిటి? నేను ఏమిటి చేస్తున్నాను, చేయబోతాను? నే నెందుకిట్లా అయాను? అసలు నే నేమిటి అయాను? నేను నేనుగానే వున్నానా?..." అని జోగయ్య తర్కించుకున్నాడు. కాని, ఈ ప్రశ్నలలో ఏ ఒక్కదానికీ కూడా, అతనికి జవాబు దొరకలేదు. "జీవితం ఎంత విచిత్రమైనది!" అనుకున్నాడు మళ్ళీ.

కాని—రెండురోజుల తర్వాత పరిస్థితులన్నీ తారుమారయినవి. శేషగిరి ఆనాడు

32 సంవత్సరముల అనుభవముగల
రెడ్డి అండ్ కో., వారి
(రిజిష్టర్డు)
కుష్ఠు, బొల్లి, సుఖ రోగోది
చికిత్సలకు నేడే సంప్రదించండి.
నకలు మందులు చూసి మోస పోకుడు.
అన్నిభాషలలో కేట్లాగు ఉచితము.
హెడ్ ఆఫీస్: రెడ్డి అండ్ కో.,
గోపాలపురం.
(తూర్పుగోదావరి)
బ్రాంచిలు:- నెల్లూరు, బెజవాడ, రాజమండ్రి
సికింద్రాబాద్, విశాఖపట్నం, బరహంపురం
మొదలగు పట్టణములలో.

కాశ్మీర్
అన్నిదగ్గులకు అమోఘమైనది
గిరిజా & కో., రాజమండ్రి

ఆఫీసుకి వెళ్ళకుండా, యింట్లో కూచుని, రోజల్లా అందరి మీద కేకలు వెయ్యడం ప్రారంభించేడు. పక్క గదిలోంచి ఈ అల్లరి అంతా వింటున్న జోగయ్యకు ఈ కేకల అర్థం ఏమిటో తెలియకపోలేదు! ఆ కేకలు, కోపం, అంతా తనమీదే కాని మరెవరిమీదా కాదని తనకు తెలుసు! ఇటువంటివి ప్రతీ బంధువు ఇంట్లోను తను చవి చూశాడు! ఈ యింటినించి వెళ్ళిపోయే సమయం వస్తున్నదని అతడు గ్రహించాడు— కాని, తను ఏమి చేయడం...?

ఆనాటి సాయంత్రం శేషగిరి సూటిగా జోగయ్యతోనే ఆఖరుమాట చెప్పివేశాడు— "జోగయ్యా! ఇంకా నేను నిన్ను పోషించగలననుకొనే మా యింట్లో వున్నావా? నేను కూడా సామాన్య సంసారినే" అని—

మర్నాడు వుదయం జోగయ్య తన సంచీ సర్దుకున్నాడు. కాని ఎక్కడకు పోవడం? "ఎక్కడకు పోవడం భగవంతుడా!" అని పదిమార్లు తన మనస్సులో అనుకున్నాడు. కాని భగవంతుడెప్పుడూ మూగివాడే.

ఆనాడు మధ్యాహ్నం ఒంటిగంట వరకూ వూరల్లా తిరిగివచ్చాడు జోగయ్య. రెండు మెతుకులు నోట్లో వేసుకునేసరికి రెండు గంటలయింది. ఆ తర్వాత జోగయ్య శేషగిరి గదిలోకి వెళ్ళి అన్నాడు.

"మామయ్యా! ఇవాళ సాయంత్రం నేను వెళ్ళిపోతున్నాను"

"ఏ వూరుకి?"

"అస్సాం. అక్కడి తేయాకు తోటల్లో కూలీ పని దొరికింది. వాళ్ళ కంట్రాక్టరు ఒకడు వచ్చి మనవూరునించి చాలా మంది కూలీలను తీసుకువెళుతున్నాడు. నా పేరు కూడా యిచ్చాను..."

శేషగిరి మాట్లాడలేదు. ఏదో ఆలోచిస్తూ వున్నాడు. జోగయ్య మళ్ళీ అన్నాడు.

"ఇవాళ సాయంత్రమే 4 గంటలకి ఒక స్పెషలు ట్రెయిను అస్సాం వెళుతుందట. అందులో కూలీలందర్నీ అస్సాము తీసుక వెళతారు... నేనూ ఆ బండికే వెళ్ళాలి..."

ఆ తర్వాత చాలాసేపటి వరకు గదిలో నిశ్శబ్దం రాజ్యం చేసింది. ఆ తర్వాత ఠంగు ఠంగుమని మూడు గంటలు వినిపించాయి. జోగయ్య తృళ్ళిపడి అన్నాడు.

"అబ్బ! మూడు గంట లయిపోయింది. నే నింక స్టేషనుకి బయలుదేరాలి."

జోగయ్య తన సంచీ తీసి, చేతికి తగిలించుకున్నాడు. "వస్తాను మామయ్యా!" అంటూ మెల్లిగా వీధివరండావేపు నడిచాడు. "వుత్తరాలు రాస్తూ వుండు" అన్నాడు శేషగిరి, కుర్చీలోంచి లేవకుండానే.

జోగయ్య వరండాలోకి వచ్చి, రెండడుగులు వేసి, ఏదో జ్ఞాపకంవచ్చినవాడిలా టక్కున ఆగిపోయి, పక్క కిటికీవద్దకు వెళ్ళి నించున్నాడు. గదిలో మంచంమీద పడుకుని నిద్రపోతున్న అనూరాధ కిటికీలోంచి అతనికి కనిపిస్తున్నది. ఎండవేళలో ఆమెకి నిద్రపోవడం అలవాటు. "అనూ! నేను అస్సాము వెళ్ళిపోతున్నాను!" అని ఆమెతో కూడ చెప్పి మరీ, తను వెళ్దామనుకున్నాడు. కాని ఆమె నిద్రపోతున్నది. కిటికీలోంచి ఆమె తనకు కనిపిస్తున్నది— అనూరాధ ఎంత చక్కనిది?

...జోగయ్య అస్సాము వెళ్ళిపోయిన 20 రోజులకి అతనివద్దనుంచి ఒక వుత్తరం శేషగిరికి వచ్చింది. అందులో, ఆఖరున "చి" అనూరాధని మరీ మరీ అడిగేనని చెప్పు, మామయ్యా" అని జోగయ్య రాశాడు. కాని, శేషగిరి ఆ వుత్తరాన్ని పూర్తిగా చదవనే లేదు.

మళ్ళీ ఏడాదివరకూ జోగయ్య భోగట్టా తెలియనే లేదు. రెండేళ్లు కూడా గడిచిపోయినవి. జోగయ్య వూసే మరిచిపోయాడు శేషగిరి. ఈలోగా అనూరాధ పెళ్ళి కూడా జరిగిపోయింది...

కాల చక్రం తిరుగుతూనే వున్నది.

ఒకరోజు శేషగిరికి అస్సాము నుండి ఏదో వుత్తరం వచ్చింది. అది తేయాకు తోటల అధికారులు రాసిన వుత్తరం. అందులో జోగయ్య అనే కూలీ టైఫాయిడు జ్వరం వచ్చి చచ్చిపోయాడనీ, అతని కియ్యవలసిన జీతం బాకీలు అతని దహన సంస్కరణ కింద ఖర్చు చేయబడ్డవనీ, అతని మరణానికి తమ సానుభూతి తెలియ జేస్తున్నామనీ రాసి వున్నది.

శేషగిరిముఖంలో సంతోషమూ లేదు, విచారమూ లేదు. "అరే! జోగయ్య చచ్చిపోయాడా పాపం!" అని మాత్రం గట్టిగా అన్నాడు.

ఈ మాటలను పక్క గదిలోంచి విన్న అనూరాధమాత్రం — ఈ లోకమంతటిలోనూ ఆమె ఒక్కతీ మాత్రం— జోగయ్యకోసం రెండు కన్నీటి బిందువులను రాల్చింది! ★

